వేస్తున్న నాటకాల్లో ఏదో పరకోవస్తే... అది అప్పుడప్పుడూ పై ఖర్చుకే హరించుకు పోతోంది-

ఈ సారి నాటకంలో ఆనందరావుది మధ్యతరగతి స్త్రీపాత్ర... మిధ్యాడంబ రాలకు పోతూ... క్షణం క్షణం భర్తను వేధించుకుతినే పాత్ర... పాత్ర చివర్లో తన బట్టల్ని చింపి, పోగులుచేసి దాన్ని భర్తమీదికి విసిరివేస్తుంది-

ఆ పాత్రకు ఆడవాళ్ళెవరూ అంత గంభీరంగా లేకపోవటంతో ఆనందరావు చేతే ఆ పాత్ర వేయిస్తున్నాడు డ్రామా డైరెక్టరు-

రిహార్సల్స్ చేస్తున్నప్పుడు గుడ్డలుచింపి భర్తమీద పోసే సీన్లో ఆనందరావు చాలా రిలీఫ్‌గా ఫీలౌతున్నాడు- బహుశా తన భార్యే ఆ విధంగా చేస్తే తదుపరి పర్యవసానమే మనేది ఆ ఆలోచనేమో-

నాటకం మొదలైంది... ఆనందరావు హావభావ ప్రకటనకు... డైలాగ్ డెలివరీకి... ముగ్ధులై... ప్రతిడైలాగ్‌కి వన్స్ మోర్లు... చప్పట్ల రూపంలో రెస్పాన్స్ ఇస్తున్నారు ప్రేక్షకులు-

ఆనందరావు చీరను చింపి, డ్రామా లోని భర్తమీద పోసే సీనది... చీరను ఒక్కో ముక్క చింపుతుంటే... అతని గుండె ఒక్కో ముక్కగా విడిపోతోంది-

నాటకంలో ఆనందరావు పాత్రకు ఉత్తమ నటన బహుమతివచ్చింది- ఆనంద రావు శిఖరాగ్ర నటనకు ముగ్ధులైన వారు అతనికి శాలువ కప్పి సన్మానించాలని తీర్మానించి అప్పటికప్పుడు... ఏర్పాట్లు చేశారు-

ఆనందరావును కుర్చీలో కూర్చోపెట్టి శాలువకప్పి, మైకుపుచ్చుకు అతని నటనా ప్రతిమను ఒక్కొక్కరే వచ్చి శ్లాఘించి పోతున్నారు-

ఇదేమీ పట్టని ఆనందరావు మాత్రం తనకు కప్పిన దుశ్శాలువాను ఎంతకు కొంటారో... ఆ డబ్బుతో భార్యకు ఎన్ని చీరలు కొనచ్చో అంచనా వేసుకుంటు న్నాడు...

*

—త్యాగప్రభ
(చిత్తూరు)

## సుత్తి...సుత్తి...సుత్తి...

వీరభద్రం చాలా కాలంగా గుమాస్తా ఉద్యోగం చేస్తున్నాడు. భార్య సత్యవతి. పిల్లలు లేని ఆ దంపతులకు జీతం సమంగా సరిపోయేది.

వీరభద్రం అంటే ఆఫీసులో అందరికీ అభిమానం. ముభావంగా, గంభీరంగా ఉండి తన పనేదో తాను సిన్సియర్‌గా చేసుకుపోయే వీరభద్రం ఇంటివద్ద పిల్లిలా ఉంటాడు. భార్య చేతిలో కాదు సుమా! మరెవరంటారా అదే వీధిలో ఉన్న హరికథ చెప్పే సుత్తిదాస్.

సుత్తిదాస్, తన పేరును సార్థకం చేసు కొన్న మహానుభావుడు. పిల్లలతో మొదలు కొని, వృద్ధులవరకు అతని బారినుండి తప్పించుకోలేరు.

* * *

భద్రం ఈలవేసుకుంటూ సంతోషంగా వచ్చాడు ఆఫీసునుంచి.

"ఏమిటా హుషారు" ఎదురొచ్చింది సత్యవతి.

"ఒసే పిచ్చిమొద్దూ, ఈ రోజు మన పెళ్ళి రోజుకదే! మల్లెపూలు చాలాతెచ్చాను" సంబ్రమంగా చెప్పాడు. సత్యవతి కళ్ళల్లో ఆనందం చూసి తృప్తిగ నిట్టూర్చాడు భద్రం.

సత్యవతి స్వీట్స్ చేసింది. ఇద్దరూ కలిసి భోంచేశారు భార్య వంటిల్లు సర్దు తుంటే, ఎదురుచూస్తూ వసారాలో కూర్చు న్నాడు భద్రం.

ఇంతలో వీధి మలుపు అవతలనుంచి సుత్తిదాస్‌సౌండ్ దగ్గరగా వినిపించింది.

అంతే! ఒక్కసారిగా కుప్పకూలి పోయాడు భద్రం. వచ్చేది తనింటికేనని గ్రహించాడు. వస్తే వచ్చినా ఇహ కదలడు. మరి తమ రాత్రి!

హఠాత్తుగా మంచి ఐడియా తట్టింది. వెంటనే లోనికెళ్ళి భార్యకి విషయం చెప్పి, గబగబా చీరకట్టుకొని వంటింటి గోడకానుకొని పడుకున్నాడు.

సుత్తి దాసు నశ్యంపొడి ఎగబీల్చుస్తూ "భద్రం! భద్రంగున్నావా" అంటూ లోనికొచ్చాడు.

"వారులేరు దాస్‌గారూ, ఊరెళ్ళారు" ఎదురొచ్చింది సత్యవతి.

"సరే! రేపొస్తాలే,

అనేసి వెనుతిరిగాడు.

తలుపేసి తిరిగొచ్చింది సత్యవతి. భద్రం ఎగిరి గంతేసినంతా పనిచేశాడు.

"నా చీరె మీకు బాగున్నదండి" అన్నది భర్తతో సత్యవతి. పగలబడి నవ్వసాగింది.

చీరను అవతల విసిరేసి "రావే నా భామా! ముద్దుల గుమ్మా!" అంటూ ముద్దెట్టుకునేలోగా తలుపు దబదబా కొట్టు కుంది.

సత్యవతి వెళ్ళి తలుపు తీసింది. 'హాచ్' అని తుమ్ముతూ లోనికొచ్చాడు. సుత్తిదాస్, భద్రం తేలుకుట్టిన దొంగలా అయిపోయాడు.

"నే ననుకున్నా భద్రం లోనే ఉంటా డని" నేరస్తుణ్ణి, జడ్జి అనే ధోరణిలో అని బాసింపట్టేసి కూర్చున్నాడు. "అరణ్య పర్వంలో ఒక మంచి ఘట్టముంది. అదే మంటే... అలనాడు రాముడు..."

ఇక ఆ దంపతులను రక్షించడం దేవుని కైనా అసాధ్యం!

*

—పి. రవీంద్రనాథరెడ్డి
(గుంటూరు)

స్రవంతి నెం: 7లో ఇచ్చినవాక్యం
"నా చీరె మీకు బాగున్నదండి"
అన్నది భర్తతో సత్యవతి.
**ఆధారంగా రాసిన కథలు**

### ఓ కథ రాయండి

ఈ కింద ఇచ్చిన వాక్యాన్ని కథలో ఎక్కడయినా ఉపయోగించి అచ్చులో అరపేజీ మించకుండా ఓ కథరాసి వెంటనే పంపండి. ప్రచురణార్హమైన కథా రచ యితలకి పాతికరూపాయలు పారితోషకం పంపబడుతుంది.

"మీకేం, పెళ్ళయిన ఆరునెలలకే తండ్రయ్యారు. నేను రెండేళ్ళయినా తల్లి కాలేకపోతున్నాను" అన్నది భర్తతో రాజ్యం.

'ఓ కథ రాయండి'
స్రవంతి వారపత్రిక.
6-3-1099/2 రాజ్‌భవన్‌రోడ్,
సోమాజిగూడ, హైదరాబాద్-500 482.